


www.amarprabha.com

# అమర్ ప్రభ

AMAR PRABHA Fortnightly పక్షపత్రిక

The Light of Your Life

సంపుటి : 01 సంచిక : 05 1 - 15 జూన్ 2014 పేజీలు : 04 వెల : రూ. 3-00



నవ్యాంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న బాబు

## నవ్యాంధ్రప్రదేశ్‌కు పచ్చతోరణంతో పంచ సంతకాలు

1. ఋణమాఫీ విధి విధానాలపై కమిటీ
2. వృధ్యాప్య వికలాంగుల పెన్షన్లు పెంపు
3. రూ.2లకే 20 లీటర్ల మినరల్ వాటర్
4. బెల్టుషాపుల రద్దు
5. రిటైర్‌మెంట్ వయసు 60 ఏళ్ళ పెంపు

## తొలిముఖ్యమంత్రి తొలి పలుకులు

1. రాజధాని నిర్మాణానికి కూలీ నెం.1 నేనే
2. స్వర్ణాంధ్ర సాధనకు రాత్రింబవళ్లు శ్రమిస్తా
3. రైతులు, పేదల ఇంట్లో పెద్ద కొడుకునౌతా



రైతు ఋణమాఫీకి సంబంధించి విధివిధానాల కమిటీ ఫైలుపై తొలి సంతకం చేస్తున్న చంద్రబాబు నాయుడు

## మూడోసారి ముఖ్యమంత్రి పీఠం

| | | |
|---|---|---|
| పేరు | : | నారాచంద్రబాబు నాయుడు |
| పుట్టిన తేది | : | 20-4-1950 |
| వయస్సు | : | 64 |
| ఊరు | : | నారావారి పల్లె, చిత్తూరు జిల్లా. |
| విద్య | : | ఎం.ఎ. ఎకనామిక్స్, |
| భార్య | : | నారా భువనేశ్వరి |
| కుమారుడు | : | నారా లోకేష్ |
| కోడలు | : | బ్రహ్మిణీ (సినీనటుడు, హిందూపూర్ ఎం.ఎల్.ఏ. బాలకృష్ణ కుమార్తె) |
| నియోజకవర్గం | : | కుప్పం, చిత్తూరు జిల్లా. |
| రికార్డులు | : | ఉమ్మడి ఆంధ్రప్రదేశ్<br>అత్యధిక కాలం ముఖ్యమంత్రి (తొమ్మిదేళ్లు)<br>నవ్యాంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రి |

చిత్తూరు జిల్లాలోని ఓ చిన్న గ్రామంలో మధ్య తరగతి రైతు కుటుంబంలో పుట్టిన చంద్రబాబు స్వయం కృషితో ఎదిగారు. పట్టువదలని శ్రమతో నిలదొక్కుకొన్నారు. ఆయన కుటుంబంలో రాజకీయ నేతలు ఎవరూ లేరు. తిరుపతిలోని వెంకటేశ్వర విశ్వ విద్యాలయంలో విద్యార్థి రాజకీయాల్లో చురుకుగా పాల్గొన్న ఆయన అక్కడి నుంచి క్రియాశీల రాజకీయాల్లోకి మారారు. 1978లో కాంగ్రెస్ ఎమ్మెల్యేగా గెలిచిన ఆయన అప్పట్లోనే ఆ జిల్లాలో ఆ పార్టీలోని రాజకీయ హేమాహేమీలతో ఢీకొని జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా తన అభ్యర్థిని గెలిపించుకొన్నారు. ముఖ్యమంత్రి అంజయ్య మంత్రి వర్గంలో మొదటిసారి 28 సంవత్సరాలకే మంత్రి అయ్యారు. మంత్రిగా ఉన్నప్పుడే ఎన్టీ రామారావు అల్లుడయ్యారు. తర్వాత పార్టీ ప్రధాన కార్యదర్శిగా టీడీపీకి బలమైన సంస్థాగత వ్యవస్థను నిర్మించడంలో కీలక పాత్ర పోషించారు. 1989 నుంచి 1994 వరకూ ప్రతిపక్షంలో ఉండి కాంగ్రెస్‌పై పెద్దఎత్తున పోరాడి ఆయన 1994లో ఎన్టీఆర్ మంత్రి వర్గంలో చేరారు. 1995లో టీడీపీలో సంక్షోభం ఏర్పడినప్పుడు ఆయన టీడీపీ తరపున మొదటిసారి ముఖ్యమంత్రి అయ్యారు. 1999లో పార్టీని గెలిపించి రెండోసారి ముఖ్యమంత్రి అయ్యారు. యునైటెడ్ ఫ్రంట్..... ఎన్డీయే కూటములకు కన్వీనర్‌గా జాతీయ రాజకీయాల్లో క్రియాశీల పాత్ర పోషించారు. 2004 అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓటమి పాలైనా వెరవకుండా పోరాటం చేస్తూ వచ్చారు. 2009 అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి ఓటమి దెబ్బ తగిలినా తట్టుకొని పార్టీ శ్రేణుల మనో స్థైర్యం నిలిపారు. ఏడు నెలల సుదీర్ఘ పాదయాత్రలో రాష్ట్రంలో పార్టీని మళ్లీ ఉత్తేజపరిచారు. రాష్ట్ర విభజన వ్యవహారం రెండు ప్రాంతాల్లో టీడీపీని ఆత్మ రక్షణ పరిస్థితుల్లో పడవేసినా తన రాజకీయ అనుభవంతో ఆ పరీక్షను తట్టుకొని సీమాంధ్రలో పార్టీని విజయపథంలో నడిపించగలిగారు. మూడోసారి ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించారు.

## సీమాంధ్రలో ప్రజల మధ్య ప్రమాణ స్వీకారం

***అమర్‌ప్రభ ప్రతినిధి, గుంటూరు:*** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్రంలోని 13 జిల్లాల నుండి తరలివచ్చిన లక్షలాదిమంది జన సందోహపు కరతాళ ధ్వనులు, కేరింతల మధ్య ప్రమాణ స్వీకార కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. బాబు ప్రమాణ స్వీకారం చేస్తున్నంతసేపు దేశం కార్యకర్తల నినాదాలతో సభా ప్రాంగణం మారు మ్రోగింది. ముందుగా ప్రకటించినట్టుగా ఆదివారం రాత్రి 7.22 గంటలకు గుంటూరు, విజయవాడ మధ్యలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదురుగా ఏర్పాటు చేసిన భారీ సభలో చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్ర గవర్నర్ నరసింహన్ ఆయన చేత ప్రమాణ స్వీకారం చేయించారు. 'భగవంతుని సాక్షిగా....' బాబు ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్యమంత్రిగా బాబు ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో పాటు, కార్యక్రమానికి హాజరైన ఇతర కేంద్ర మంత్రులు వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఆయన్ను అభినందించారు. అనంతరం రాష్ట్ర మంత్రులు ప్రమాణ స్వీకారం చేశారు. ముందుగా ఊహించినట్టే చంద్రబాబు కేబినెట్‌లో 19 మంది మంత్రులు కొలువు దీరారు. బాబు కేబినెట్‌లో ముగ్గురు మహిళలకు స్థానం లభించింది. ముందునుంచి ఊహించినట్టుగానే కె.ఇ.కృష్ణమూర్తి, నిమ్మకాయల చిన్న రాజప్పకు డిప్యూటీ సిఎం పదవులు దక్కాయి. ఇద్దరు బిజెపి ఎంఎల్ఏలకు సైతం మంత్రివర్గంలో అవకాశం లభించింది.



చంద్రబాబు ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరైన అతిరధ మహారథులు

# ఇదీ ఎన్టీఆర్, చంద్రబాబుల విజన్!





**అమర్‌ప్రభ ప్రతినిధి, తెనాలి:** దేశ వ్యాప్తంగా వున్న తెలుగువారి రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక పునాదుల పరిరక్షణే ధ్యేయంగా ప్రముక తెలుగు నటుడు డా.ఎన్టి రామారావు 1983లో తెలుగుదేశం పార్టీని స్థాపించారు. ప్రజల ఆత్మగౌరవ పరిరక్షణ నినాదంతో తెరపైకి వచ్చిన తెలుగుదేశం పార్టీ దానిని ఆచరణలోనూ ప్రతిబింబించింది. సామాన్యుడికి కూడు, గూడు, గుడ్డ, అందుబాటు ధరలకు నిత్యావసరాల లభ్యత, మహిళ, యువత, సమాజంలోని ఇతర వెనుకబడిన వర్గాలకు సాధికారికత కల్పించడమే ధ్యేయంగా ముందడుగు వేసింది. సామాజిక న్యాయం, అందరికీ సమానత్వం అన్న మౌలిక సూత్రాలను తన పార్టీ రాజ్యాంగ పీఠికలో పొందుపర్చిన తెలుగుదేశాధినేత ఎన్టీఆర్ 'సమాజమే దేవాలయం, ప్రజలే నాదేవుళ్లు' అంటూ అనునిత్యం తన కర్తవ్యాన్ని గుర్తు చేసుకునే వారు. ప్రజల సంక్షేమమే కాదు ప్రజా జీవితంలో పోటెత్తుతున్న అవినీతిని, దానికి ఆజ్యం పోస్తున్న కాంగ్రెస్ పార్టీని సమూలంగా తుడిచిపెట్టాలన్న ధ్యేయాన్ని తెలుగుదేశం పార్టీ తన అజెండాలో ప్రాధాన్యతాంశంగా పొందు పర్చింది. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు రాష్ట్రంలోను, దేశంలోనూ కాంగ్రెసేతర పక్షాలతో సమన్వయంతో పనిచేసేందుకు ముందడుగు వేసింది. మైనార్టీల సంక్షేమం, లౌకిక విధానాల అనుసరణ, భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్య సంప్రదాయాల పరిరక్షణ వంటి అంశాలను అనుసరిస్తూ పాలనను ప్రజల ముంగిటకు తీసుకెళ్లిన తెలుగుదేశం పార్టీ 1995లో పార్టీ, ప్రభుత్వ పగ్గాలను చేపట్టిన నారా చంద్రబాబు నాయుడుకు వీటిని మార్గదర్శక సూత్రాలుగా మలచింది. ప్రపంచ బ్యాంకు సాయంతో పాలన, ఆర్థిక, విద్యుత్ సంస్కరణలను అమలులోకి తెచ్చిన తెలుగుదేశం పార్టీ మానవ వనరుల్లో నైపుణ్యాన్ని పెంచి సమర్థవంతమైన పాలనా వ్యవస్థలను ఏర్పాటు చేయడం ద్వారా అభివృద్ధి కార్యక్రమాల ఫలాలను ప్రజలకు అందించేందుకు ప్రయత్నించింది. ఇతర జాతీయ, ప్రాంతీయ పార్టీల మాదిరిగా కాక తెలుగుదేశం పార్టీ ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభం వంటి పత్రికా రంగానికి స్వేచ్ఛ అవసరమన్న విశ్వాసాన్ని వ్యక్తం చేసింది. పూర్తి ప్రతిపత్తి కలిగిన ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియాలు ఆరోగ్యకరమైన సమాజ ప్రగతికి అవసరమని భావించింది. అందువల్లే తెలుగుదేశం పార్టీ తన హయాంలో పత్రికా స్వేచ్ఛకు గట్టి పునాదులు వేసింది.

పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీ రామారావు, ఆయన వారసుడిగా పగ్గాలకు చేపట్టిన చంద్రబాబు నాయుడు రూపొందించిన విజన్ ఆంధ్రప్రదేశ్ ప్రధానాంశాలు.

* తెలుగు సంస్కృతి, సాహిత్యం, భాష వంటి వాటిని పూర్తి స్థాయిలో ప్రోత్సహించి వాటికి గుర్తింపు కల్పించటం.
* గ్రామాల్లో వ్యవసాయాన్ని లాభదాయక వృత్తిగా ప్రోత్సహించి రైతులకు సాంకేతిక, ఆర్థిక సహకారంతో పాటు సబ్సిడీలు, మార్కెటింగ్ వంటి సౌకర్యాలు కల్పించడం.
* ఇతర వాణిజ్య వస్తువుల తరహాలోనే వ్యవసాయోత్పత్తులకు కూడా కనీస మద్దతుధర ద్వారా గిట్టుబాటు ధరను కల్పించడం.
* జలవనరులు, హరిత వనాలు, పర్యావరణ పరిరక్షణ వంటి ప్రాకృతిక వనరులను పరిక్షించి భావితరాలకు అందించడం.
* గ్రామీణ ప్రాంతాల్లోని విద్యావంతులైన యువతకు నైపుణ్యం పెంచే శిక్షణ కార్యక్రమాల ద్వారా యువత సాధికారతకు కృషి చేయడం, వారికి సాంస్కృతిక, క్రీడా కార్యక్రలాపాలలో ప్రోత్సాహం కల్పించి వారిని తీవ్రవాద, ముఠా కక్షల ప్రభావం నుండి కాపాడటం.
* గ్రామాల నుండి మండలాలు, జిల్లా పరిషత్‌లు, పురపాలిక, నగరపాలిక వంటి స్థానిక సంస్థలకు మరిన్ని ఆర్థికాధికారాలు కల్పించడం.
* గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు సాధికారత కల్పించి రాజ్యాంగ వ్యవస్థలు, చట్ట సభల్లో 50 శాతం రిజర్వేషన్లు అమలు చేసి దేవ ఆర్థిక, సామాజిక ప్రగతిలో వారిని భాగస్వాములను చేయడం.
* పేదరిక రేఖకు దిగువన వుండే కుటుంబాల వారికి సబ్సిడీ ధరలతో నిత్యావసర వస్తువులు, బియ్యం వంటి వాటిని జాతీయ ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అందుబాటులోకి తేవటం.
* ముస్లిం, క్రైస్తవ మైనార్టీ వర్గాల వారికి బడ్జెట్ వాటా కేటాయించి విద్య, ఆరోగ్య, ఉపాధి, సాంస్కృతిక రంగాలలో వారి ప్రగతికి పునాదులు వేయడం.

## దళిత కిషోరం 'రావెల' జీవిత చరిత్ర



**పేరు** : రావెల కిషోర్ బాబు (ప్రత్తిపాడు అసెంబ్లీ నియోజకవర్గం)
**పుట్టిన తేది** : 11-3-1959
**చదువు** : ఐఆర్‌టిఎస్
**స్వగ్రామం** : తాడికొండ మండలం, రావెల
**తండ్రి పేరు** : ఇసాక్
**భార్యపేరు** : శాంతి జ్యోతి
**పిల్లలు** : ఇద్దరు కుమారులు సోన్‌పాల్, సుశీల్ కుమార్తె సకీన్

రావెల కిషోర్ బాబు ఎం.ఎ పూర్తి చేసిన తరువాత ప్రకాశం జిల్లా ఒంగోలులో ఎంబిఎం డిగ్రీ కళాశాలలో ఎనకామిక్స్ లెక్చరర్‌గా రెండు సంవత్సరాలు, అనంతరం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రొబేషనరీ ఆఫీసర్‌గా ఉద్యోగం ఎంపికయ్యారు 1989-2000 వరకు దక్షిణ మధ్య రైల్వేలో, 2000 నుంచి 2002 వరకూ న్యూఢిల్లీలో లోక్‌సభ స్పీకర్ బాలయోగి వద్ద ఓఎస్‌డిగా, 2004 వరకు అంబేద్కర్ ఫౌండేషన్ కేంద్ర ప్రభుత్వ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించారు. 2004-08 వరకూ కులికుతుబ్‌షా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ, హైదరాబాద్ అడ్మినిస్ట్రేట్‌గా పనిచేశారు. దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ ప్రధాన కార్యలయం రైల్ నిలయంలో ఛీఫ్ కమర్షియల్ మేనేజర్ (సిస్టమ్స్)గా పని చేస్తూ స్వచ్ఛంద పదవీ విరమణ తీసుకొని, 2014 గుంటూరు జిల్లా, ప్రత్తిపాడు అసెంబ్లీ నియోజకవర్గంలో ఎన్నికై సాంఘీక సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖకు మంత్రిగా పని చేస్తున్నారు.

గతంలో 1973 నుండి 1989 వరకు అంబేద్కర్ వాదిగా రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియాలో విద్యార్థి విభాగంలో పనిచేశారు. 1997 నుండి 2000 వరకు మాన్యశ్రీ కాన్షీరాం గారితో అత్యంత సన్నిహితంగా కలిసి ఆంధ్రప్రదేశ్‌లో బహుజన ఉద్యమ నిర్మాణానికి కృషి చేశారు. మాన్యశ్రీ కాన్షీరాం గారితో కలిసి దేశ వ్యాప్తంగా పర్యటించడమే కాకుండా అంత ర్జాతీయంగా 12 దేశాలు సందర్శించి అనేక సెమినార్‌లలో, కాన్ఫరెన్స్‌లలో పాల్గొని ఆయాదేశాల సమాజాలను అధ్యయనం చేశారు. ప్రస్తుతం మాన్యశ్రీ కాన్షీరాం ఫౌండేషన్స్ వ్యవస్థాపకులుగా అంబేద్కరిజాన్ని, కాన్షీరామిజాన్ని ప్రజల్లోకి ముఖ్యంగా దళితులలో మరియు దళిత - క్రైస్తవులలోకి తీసుకు వెళ్ళి వారిలో సామాజిక, రాజకీయ చైతన్యాన్ని తీసుకువస్తూ తద్వారా ఆంధ్రప్రదేశ్‌లో బహుజన రాజ్యాధికార సాధనకు కృషి చేశారు.

## బాబు తాజా 'విజన్ 2019'

* 2019లో రెండు ప్రాంతాల్లో అధికారం * జాతీయ పార్టీగా టీడీపి



**అమర్‌ప్రభ ప్రతినిధి, హైద్రాబాద్:** తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో 2019 ఎన్నికల్లో విజయం సాధించడమే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని టీడీపీ అధినేత, ఆంధ్రప్రదేశ్‌కు కాబోయే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం చేశారు. గండిపేటలో ఇటీవల అట్టహాసంగా ప్రారంభమైన మహానడు కార్యక్రమానికి ఆ పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా చంద్రబాబునాయుడు ప్రారంభోపన్యాసం చేశారు. దాదాపు గంటన్నరపాటు సాగిన ప్రసంగంలో 2019 ఎన్నికలే లక్ష్యంగా కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. తెలుగుదేశం పార్టీని జాతీయపార్టీగా మారుస్తున్నామని ప్రకటించారు. 'ఆ ఎన్నికల్లో జాతీయ పార్టీగానే పోటీ చేస్తాం' అని చెప్పారు. '2014 ఎన్నికల్లో ఆంధ్రప్రదశ్‌లో గెలిచాం. అది చాలదు. 2019 నాటికి రెండు రాష్ట్రాల్లోనూ అధికారంలోకి మనమే రావాలి' అని అన్నారు.

శుభాకాంక్షలు
మీ బంధువులు, మిత్రులు, శ్రేయోభిలాషులకు
సందర్భంగా అమరప్రభ పత్రికలో శుభాకాంక్షలు తెలియజేయాలనుకుంటున్నారా? అతి తక్కువ ధరలో ప్రకటనలకోసం సంప్రదించవలెను
మొబైల్ : 85002 21739

వ్యాపార ప్రకటనలకు విజ్ఞప్తి
మా పత్రికలో అన్ని రకాల వ్యాపార ప్రకటనలు (మల్టీ కలర్, బ్లాక్ & వైట్) ప్రచురించబడును. ప్రకటనలకు, యాడ్స్‌కు అందుబాటులో ధరలు నిర్ణయించబడినవి. కావున యాడ్స్, ప్రకటనలు ఇవ్వదలచినవారు యాడ్స్ ప్రతినిధి లేదా ఈ క్రింది నెంబరుకు సంప్రదించగలరు.
మొబైల్ : 85002 21739